# షణ్మార్గం

స్నేహితులంతా గిండీ రేసెస్‌కి వెళ్ళిపోయారు. అనంతం జేబులో పది రూపాయలకంటే ఎక్కువలేదు. మొదటి తేది యింకా అయిదురోజులుదాకా రాదు. ఈలోపల సిగరెట్లూ, కాఫీ వగయిరా లన్నింటికీ నాన్న డబ్బు పంపేదాగా సరిపెట్టుకోవాలి. స్నేహబృందం ప్రక్కన లేకపోవడంవల్ల అనంతానికి పిచ్చెక్కినట్టవుతోంది. నాలుగింటికి కాఫీతాగి, సిగరెట్ ముట్టించి, మల్లెపువ్వులా తయారయి, ట్రిప్లికేన్ బస్ అందుకున్నాడు.

రూమ్‌మేట్సు యింటికొచ్చేదాకా తను ఎలాగో కాలం గడపాలి. మనసు సినిమాకెళ్ళమని తొందరజేసింది. సినిమా ఆరుంబావుకుగాని మొదలెట్టరు. ప్రస్తుతం టైము నాలుగుంబావు - మరి మధ్య రెండు గంటలో... ఆలోచించాడు. సినిమా టైముదాకా బీచిలో గడిపి_ఆపైన సినిమాకెళ్ళి - స్నేహితులింటికొచ్చే వేళకి తనూ జేరుకోవచ్చుగదికి.

అనంతం యఫ్. యల్. క్లాస్ చదువుతున్నాడు. మరీ అందగాడు కాదు, అందవికారీ కాదు. సామాన్యంగా ఉంటాడు మనిషి. కాని హృదయం మటుకు ఏవో గొప్ప ఆద

ర్శాలతో, ప్రపంచంమీద సానుభూతితో తొణికిసలాడుతూ ఉంటుంది.

అమ్మ నాన్న దగ్గిరవుండి గుంటూరులో బి.ఏ. పూర్తి చేశాడు. తర్వాత ప్రపంచానికి న్యాయం కూర్చాలనే తాపత్రయంతో న్యాయవాది చదువుకు దిగాడు. మొదటినుంచీ పుష్కలంగా కాకపోయినా తన అవసరాలకీ, విద్యకూ సరిపడే డబ్బున్న అనంతం దేశంలోని దారిద్ర్యం చూసి మహా విచారించేవాడు. తిండీ బట్టా లేని ప్రజలకు ఏదో తను సహాయం చెయ్యాలని ఆరాటపడేవాడు.

ఆ ఆరాటం పట్నంవచ్చాక మరీ ఎక్కువ అయింది. పేవ్ మెంటుమీద వండుకుతిని జీవించే కుటుంబాలనీ, బస్ స్టాండులదగ్గిర అవిటివాళ్ళని చూసి అతని హృదయం నిస్సహాయంగా ద్రవించేది. అందులో పట్నంలోవున్న వేలాది అన్నార్తుల్ని చూస్తే అతనికి వూపిరి సలిపేదికాదు. యవ్వనంలో తనకి ప్రతివస్తువా ఏవో సుందరంగా కొత్త రంగులతో కనబడుతూంటే, వాటిమీద నీడల్లా యీ బీదా బిక్కా అతన్ని వెన్నాడుతుండేవి. వేడిరక్తం లేమిని తరిమి వెయ్యాలని రకరకాల ఆలోచనలకి పోయేది.

అలా అని అతను సినిమాలకీ, హోటళ్ళకీ వెళ్ళకుండా ప్రతి కానీ బీదసాదలకి యిస్తున్నాడని అనుకోడం తెలివితక్కువ. కాఫీహోటలుకెళ్ళి బయటకొచ్చి కిళ్ళీ నమిలి, సిగరెట్ ముట్టిస్తుండే వేళకి "అయ్యా" అని చేయిజాపే దరిద్రులకి కానీగాక, అణా బేడా యిస్తుండేవాడు, అదే అతను

చేసే ఘనకార్యం. అతని దయాదాక్షిణ్యాలు కాని నుంచి బేడదాకా పెరిగాయి. దారిపక్కన దొర్లే బిచ్చగాణ్ణి సంస్కరిద్దామని ఉండేది. కాని ఎలా? ఏ విధంగా మహానాయకులకే మార్గాలు తెలియనప్పుడు యస్. యల్. చదివే విద్యార్థికా?

బస్సెక్కి బీచిలో దిగాడు అనంతం. బీచి అంతా రంగురంగుల చీరల్తో తళుక్కున మెరుస్తోంది. బెలూనులు గాలిలో ఎగుర్తున్నాయి. రేడియో సరిగమల్ని చెవుల్లోకి పంప జూస్తోంది. వేరుసెనగలవాళ్ళు ఒకటే కేకలు, అనంతం చుట్టూ చూశాడు. తనెరుగున్న వాళ్ళెవరూ కనపడలేదు. ఏమీ తోచలేదు. మనసు దేనిమీదా నిల్చిలేదు. జీవిత శూన్యం లోంచి సముద్రపు శూన్యంలోకి చూస్తున్నట్టు ఉంది.

ఆ అమ్మాయి అక్కడినుంచి కదిలి పక్కనేవున్న గారడి గుంపులో కలిసిపోయింది. అనంతం ఎందుకో అలా ఆ అమ్మాయిని వెంటాడుతూ గుంపు దగ్గిరకు జేరుకున్నాడు. ఈ సారి ఆ అమ్మాయి పది గజాలకంటే ఎక్కువ దూరంలో వేదు. అనంతం స్పష్టంగా ఆ అమ్మాయి ముఖాన్ని చూడ గలిగాడు. ముఖంలో ఆకర్షణ లేదు సరిగదా, యవ్వనంలో కనిపించవలసిన అందంగూడా లేదు. ఒక విధంగా అంద విహీన అని చెప్పవచ్చు. నల్లని ముఖం, చిన్న కళ్ళు, పెద్ద నోరు, ముక్కు అదిమినట్టుగా ఉంది. పురుషుల్ని ఆకర్షించే ఏ కాస్త అందమూ లేని ముఖంచూస్తే అనంతానికి ఆసక్తి కలిగింది. ఆసక్తికాదు జాలి కలిగింది.

కంపెనీ చీరెకా స్త మాసినట్టుగా వుంది. గట్టిగా బిగించి వేసిన జడకి చివర పసుప్పచ్చని మురికి రిబ్బనుచూ స్తే అనంతానికి చిరునవ్వు వచ్చింది. చేతిలో వెలిసిపోయిన పువ్వుల గొడుగు. గొడుగు పిడి విరిగిపోయింది. దానికి తాడు కట్టి గర్వంగా చేతులో పుచ్చుకుంది. వెలిసిన ఎఱ్ఱజాకెట్టు మీాద సూర్యరశ్మి పడటంవల్ల బూడిద రంగుగా కనిపించింది.

ఆ అమ్మాయి గుంపును వదిలి కిందికి చూస్తూ నడుస్తోంది. అనంతానికి ఆ పిల్లమీాద అపారమైన జాలి పుట్టుకొచ్చింది.

పాపం! యిరవై, యిరవై రెండేళ్ళ వయసులోకూడా ఏ పురుష హృదయాన్నీ ఆకర్షించలేకపోయి ఉంటుంది. ఆ సాయంత్రం స్త్రీ పురుషులుఒకర్నొకరు రాచుకుంటూ, నవ్వుకుంటూ తిరిగే బీచిలో అనంతానికి తనూ—ఆ ఆడమ్మాయి వారిద్దరే అలా ఏకాంతంలో తిరుగుతున్నట్లు అనిపించింది.

అతని హృదయంలో అణిగి మణిగివున్న అహంభావం-ఆ పిల్లకి ఆ సాయంత్రం ఏదో ఆనందాన్ని చేకూర్చాలని నిశ్చయించుకున్నాడు. తనలాంటి విద్యావంతుడూ, రూపసీ ఒక సాయంత్రం ఆమెకు వ్యక్తిత్వాన్ని యిచ్చి ఆదరించడం ఆ అమ్మాయి జీవితంలో మరపురాని ఘట్టం అవదూ? సహారా ఎడారిలాంటి ఆమె జీవితంలో యీా సాయంత్రం ఒక ఒయాసిస్సు అవగల ఆనందం తను కూర్చాలి - అనుకుంటూ పెద్ద పెద్ద అంగల్తో ఆ అమ్మాయి పక్కకెళ్ళి "నమస్తే" అన్నాడు అనంతం.

"ఆ" అంటూ తెల్లబోయి అతని వంక చూసింది ఆ పిల్ల.

"నమస్తే" అన్నాడు తిరిగి.

"యెవరు మీరు?" అంటూ తిరిగి నమస్కారం చెయ్యకుండా సూటిగా ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలోని యాసకు అనంతం నవ్వుకున్నాడు. బహుశా ఏ కలవారింట్లోనో పనిమనిషేమో.

"నేను - అనంతాన్ని బి. ఎ. పాసయాను. మీరు ఒంటిగా...." అంటూ నసిగాడు.

ఆ అమ్మాయి మాట్లాడకుండా నడక సాగించింది.

"మీతో ఎవరూ లేనట్టున్నారు. నేనూ ఒక్కడినే, అలా తిరిగి కాంటిన్‌లో కాఫీతాగి ఖబుర్లు చెప్పుకుందాం."

ఆ అమ్మాయి కంగారుగా అతనివంక చూసి తడబడుతూ "కాఫీకి నాదగ్గిర దుడ్డుయిల్లే-నేను రాను, మీరు సాపడండి." అంది తలవంచుకుని.

"మనిద్దరి కాఫీకి సరిపడు దుడ్డు నా దగ్గిరవుంది రండి, వెళదాం. లేకపోతే ఆ మూల కూచుందాం. కాసేపు వుండి కాఫీ తాగవచ్చు."

"మీకు పణం నిండా ఉందా? నాదగ్గిర దుడ్డులేదు. నన్ను కాఫీకి యెవరు ఎన్నడూ కూపడిలేదు." అంది ఆశ్చర్యంగా.

"నేను పిలుస్తున్నాగా - రావు" అన్నాడు మళ్ళీ అనంతం;

ఆ అమ్మాయి వెనక్కి తిరిగింది. బొడ్డోంచి నలుపు చేతిరుమాలుతీసి ముఖం తుడుచుకుని నడుస్తూ, "నన్ను యారు ఎప్ప కాఫీకి కూపడలేదు." అంది నెమ్మదిగా మళ్ళీ.

"నీ పేరు?"

"షణ్ముగం."

"ఏం జేస్తున్నావ్? పెండ్లయిందా?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

"కల్యాణం అవలేదు. తిరువత్తూరు ఫ్యాక్టరీలో వేల చేస్తున్నాను. రెండు వారాలకో తూరి దుడ్డు పుచ్చుకు పట్నం వచ్చి మళ్ళీ ఏడుమణికి తిరువత్తూర్ పూడుస్తాను" అంది.

"ప్రతి శని ఆదివారాలూ, ఫ్యాక్టరీకి శలవ ఇవ్వరూ?" అని ప్రశ్నించాడు.

"లీవు ఇస్తారు కానీ పట్నం రావడానికి దుడ్డుఆపడదు. అందుకు మాసానికి రెండు తూరి మూడు మణికి వచ్చి-ఏడు మణికి పూడుస్తా" అంది షణ్ముగం.

ఇద్దరూ మెరీనా కాంటీన్ దగ్గిర కొచ్చారు. సాయంకాలపు నీరెండ సముద్రంలో ప్రతిబింబిస్తోంది. ఇందాకటి కంటె బీచిలో జనసందోహం ఎక్కువయింది. కాంటీన్‌లో రకరకాల మనుషులు, ముఖ్యంగా పట్టుచీరెలు - విలువైన

నూట్లు ఇవన్నీ అనంతం కంటబడ్డాయి. ఎరుగున్న వాళ్ళు కనబడతారేమోనన్న ఆదుర్దా కలిగింది అనంతానికి. గబుక్కున తన స్నేహితులెవరన్నా, యీ బీదపిల్ల పక్కన, మెళ్ళో పూసలు కట్టుకున్న నల్లపిల్ల పక్కన, తనను చూస్తే ఎంత అవమానం! నలుపక్కలా కలియజూశాడు - ఎవరూ ఎరుగున్న వాళ్లు కనపడలేదు.

షణ్ముగాన్ని వెంట తీసుకొని ఒక పక్కగావున్న టేబుల్ దగ్గిర కూలబడ్డాడు. హోటల్లో అందరి కళ్ళూ తన మీద వున్నట్లుగా వుంది. ముచ్చెమటలు పోశాయి. నిల్చుని జేబులోంచి రుమాలు తీసుకో బోతున్నాడు. దూరాన శకుంతలా మాధవీ ఇద్దరూ కూచుని వుండటం చూశాడు. అనంతం కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి. వెయిటర్ వచ్చి టేబుల్ దగ్గిర నిల్చుని వున్నాడు.

"ఏం తింటావ్" అన్నాడు నెమ్మదిగా అనంతం.

"కాఫీయేగా. ఆవల డుబ్బు లేదుగా" అంది షణ్ముగం గట్టిగా. వెయిటర్ వెకిలిగా నవ్వుతున్నాడు. అనంతానికి వాణ్ణి పట్టుకు తన్నాలనిపించింది. "రెండు ఐస్‌క్రీమ్ - చిప్స్" అన్నాడు విసురుగా వెయిటిర్ వంక చూస్తూ, వాడు నిర్లక్ష్యంగా నవ్వి వెళ్ళిపోయాడు.

అనంతానికి ముళ్ళమీదున్నట్టుంది. దూరాన వున్న మాధవీ శకుంతలా ఎక్కడ చూస్తారో అని కంగారుగావుంది. షణ్ముగం నిర్భయంగా, వాతావరణంలోని మార్పులను గమనించనట్లు, పరిసరాల్లోని ధనాఢ్యుల్ని చూడనట్టు, హాయిగా

కూచుంది. ఈ పట్టుచీరెలూ, ఫాషన్లు ఆ అమ్మాయిని అంటడంలేదా? లేక వాటి విలువ తెలియదా?

“నన్ను యారు ఎప్పు కాఫీకి కూపడలేదు” అంటోంది తిరిగి షణ్ముగం. గొంతు పిసకాలనిపించింది అనంతానికి. ఎప్పుడూ ఎవరూ పిలవకపోతేనేం? ఇవ్వాళ తను పిల్చాడుగా! నోరుమూసుకు కూచోరాదు! వెధవది లేనిపోనిది తెచ్చుకున్నాడు. మాధవీ శకుంతలా తనవైపే చూస్తున్నారు-నవ్వుకుంటున్నారు.

రేపు మాధవి క్లాసులో తలెత్తి చూస్తుందా? అనంతం కామన్ గరల్స్‌తో తిరుగుతున్నాడని శకుంతల నలుగురితో అనక మానుతుందా? తన గౌరవం, మాధవిమీద ఆశలు! యీ నల్లపిల్లను వదుల్చుకుంటే....

వెయిటర్ నిర్లక్ష్యంగా చప్పుడుతో టేబుల్ మీద ఐస్‌క్రీమ్ వగైరా పెట్టాడు. “వెధవికి, వాడికెందుకు ఆ హేళన-ఎవర్నో తెస్తే ఏం, డబ్బివ్వడంలేదూ. వెధవ ఎగిరి పాటు వీడూనూ_“కాఫీ-బిల్లు” అన్నాడు విసురుగా అనంతం.

షణ్ముగం ఐస్‌క్రీమ్ నోట్లో పెట్టుకుని “ఇంత జిల్లుమంది. నే నెప్పొ సాపడలేదు” అంది వుత్సాహంగా. ఆ మాట లనేటప్పటి కళ్ళలోని తృప్తి కొత్త వెలుగు చూశాక అనంతానికి కాస్త కోపం చల్లారింది. మాధవీ శకుంతల కళ్ళల్లో ఆ కృతజ్ఞతా, తృప్తి తను లక్షలిచ్చయినా తెప్పించ గలడా?

“మరొక కప్పు తింటావా?” అన్నాడు దయగా.

"పల్లు పూడుస్తుంది వాణా" అంది షణ్ముగం.

"కాని యింకోకప్పు?" అన్నాడు మల్లీ.

"వద్దు" అంది తలవూపుతూ.

"మల్లీ ఎప్పుడొస్తావ్ యిక్కడికి?" అని ప్రశ్నించాడు.

"రెండోవారం పోనాక. అంటే వొంబదాం తేదీన మూడుంకాలుకివస్తా నాలుమణిదాకా బస్సువద్దే కల్చుకుంటా మీరు వస్తారుగా" అంది తను సిగ్గుతో.

ఇందాకటినుంచీ చూడని అందం ఆమె చెక్కిళ్ళమీద కనబడింది అనంతానికి. "అల్లాగే, బస్సుదగ్గిర యెందుకు? యివ్వాళిటికిమల్లె నడుస్తాండు-కలుసుకుంటా" అన్నాడు చిప్స్ కొరుకుతూ.

వెయిటర్ కాఫీ తేవటంతో తలెత్తాడు. మళ్ళీ శకుంతలా మాధవీలు-చుట్టూ సిల్కు-చీరెలు, సూట్లు - మధ్య షణ్ముగం తనూ. మాధవీ శకుంతలలు ఏవేవో గుసగుసలు చెప్పుకుంటున్నారు.

మళ్ళీ తేళ్లూ, జెర్రులూ పాకినట్టయింది. "అయిందా పోదాం. నువ్వికవెళ్లు నాకు పనుంది" అన్నాడు విసుగ్గా షణ్ముగంతో.

"ఇప్పుడుమణి అంజేగా ఆరుమణిదాకా నాకు వేల లేదు," అంది షణ్ముగం.

"నాకు పనివుంది నువ్వింక వెళ్ళిపో" అన్నాడు లేని కాఠిన్యాన్ని కంఠంలోనికి తెస్తూ.

షణ్ముగం రాళ్ళని కరిగించేలా చూస్తూ "వాంబాదాం తేదీన నాలుమణికి కట్టాయం వస్తారా?" అంది దీనంగా.

ఆ కళ్ళలోకి చూస్తుంటే షణ్ముగం వెంటవెళ్ళి సాయంత్రందాకా వుండి, ఆ అమ్మాయిని బస్సెక్కించాలని పించింది. కాని దూరానవున్న మాధవి గులాబీ జార్జెట్ చీర! శకుంతల నైల్‌పాలిష్ టేబుల్‌మీద వారి ప్లాస్టిక్ బాగ్‌లు అన్నీ అతన్ని వెనక్కి లాగాయి!

"అల్లాగే" అన్నాడు కటువుగా.

"కట్టాయం" అంది బెరుగ్గా.

"కట్టాయం" అన్నాడు మృదువుగా.

షణ్ముగం వంటెగా దీనంగా వంగిన బుజాలతో నిర్జీవంగా నడిచి వెళ్ళిపోయింది.

నుదుటిమీద చిరుచెమటల్ని రుమాలుతో తుడుచుకుంటూ, మాధవీ శకుంతలల టేబుల్‌వైపు నడిచి 'హల్లో' అన్నాడు హుషారుగా అనంతం. శకుంతల 'హల్లో' అంది తిరుగా నవ్వుతూ. మాధవి తను ఆ పక్క లేనట్టూ తనకూ ఆ వచ్చిన మనిషికీ సంబంధం లేనట్టూ మొహం తిప్పేసుకుంది.

'అనుకున్నంతా అయింది' అని మనస్సులో అనుకుంటూ కుర్చీమీద కూలబడ్డాడు అనంతం.

శకుంతల యీ మాటా ఆ మాట మాట్లాడింది. మాధవిని పల్కరిద్దామని ప్రయత్నించి ఆమె దగ్గరనుంచి సమాధానం రాక, వోడిపోయిన యోధుడిలా మొహంపెట్టి కూచున్నాడు అనంతం.

"ఆ అమ్మాయి ఎవరూ?" అని ప్రశ్నించింది మాధవి గబుక్కున.

ఏం సమాధానం ఇవ్వాలో తెలీక తికమక పడ్తున్న అనంతాన్ని చూస్తూ "మీ చెల్లెలా?" అంది మళ్ళా మాధవి.

అనంతానికి మాధవిమీద అసహ్యం వేసింది. ఎంత యినా ఆ కూలి పిల్లను పట్టుకు 'నీ చెల్లెలా అని అడుగు తుందా? తనంత లేనివాడనుకుందా? ఎంత చదువుకున్నా, ఎంత అందమైనదైనా తననీవిధంగా మాటల్తో అవమాన పర్చక్కర్లేదు! 'అవును' అని అందామనుకున్నాడు. కాని యీ దెబ్బతో మాధవితో తెగతెంపులు చేసుకోవలసి వస్తుందని తమాయించుకుని "కాదు" బీచిలో కలుసు కున్నాను. ఎప్పుడో చిన్నప్పుడు తెలుసున్నమ్మాయి" అన్నాడు తడబడుతూ.

మాధవీ శకుంతలకి తను షణ్ముగాన్ని ఏ పరిస్థితుల్లో పిల్చిందీ చెపితే అర్థమవుతుందా? తను ఇంపెల్సిట్‌గా చేసింది వాళ్ళకి భోధపడుతుందా? తనది చంచల హృదయం కాదంటే మాధవి నమ్ముతుందా? ఒకవేళ అన్నీ విని తనను వెర్రి వెంగళప్పకింద కడితే? తన మనస్తత్వాన్ని అర్థంచేసుకునేశక్తి మాధవికి వున్నదా? అయినా యిది సమయం కాదనీ ప్రశ్నార్థకంగా చూసే ఆమె చూపుని తప్పించుకున్నాడు. అయితే మాధవి వూరుకుంటుందా? లేడికళ్ళతో ఆమె తన వంక తిరిగి "మళ్ళీ వస్తుందా?" అని అడిగింది.

అబద్ధాలకి అలవాటు పడని అనంతం, సమాధానం

వల్ల కలిగే చిక్కుల్ని వూహించక "తొమ్మిదో తేదీ శని వారం యీ వేళకే వస్తుంది" అని చెప్పాడు

తను తెలుసుకోవలసిన విషయాలు పూర్తి అయి నట్లు మాధవి శకుంతల వంకజూసి కళ్ళెగరేసింది. ముగ్గురూ లేచారు. అనంతం బిల్లు చెల్లించాడు. "గుడ్ బై" అన్నారు ఐక్యకంఠంతో. అందచందాలే అబలలు.

○ ○ ○ ○

"ఇంత వెకిలివాడని అనుకోలేదు" అంది మాధవి.

"అంటే?" అంది శకుంతల.

"ప్రతి అలగాజాతి పిల్లతో పోయేవాడని తెలుస్తే యింతదూరం అతనితో స్నేహం చేసివుండకపోదును. ఛీ, ఆ పచ్చరిబ్బనూ అదీనూ. దానిలో ఏ అందం చూశాడో!" అంది మాధవి.

"అతను చెప్పినట్లు చిన్నప్పటి ఏ పనివాళ్ళ పిల్లో అయివుండవచ్చు. దానికింత రాద్ధాంతం ఎందుకు?"

"అదికాదు. మళ్ళీ శనివారం వొస్తుందట చెప్పా డుగా. పసిపిల్ల అయితే యివ్వాళతోనే పోను. అతనిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నా. ఇంక రేపటినుంచి అతని ముఖం చూడను" అంది మాధవి నిష్కర్షగా.

"ఒక్కమాట చెప్తాను విను. అనంతంలో నీకు ఇంత వరకూ ఏ లోపాలూ కనపడలేదు. అవునా?"

"ఈ ఒక్కటీ అంటావా, దీని అంతూపంతూ తేల్చు కుందాం. ఏదో తొందరపడి అతనితో తెగతెంపులు చేసు కోడం బాగుండదు. మీ రొమాన్సు కాలేజీ అంతా తెలుసు నాయెను, మీ వాళ్ళకుకూడా చూచాయగా తెలుసు. అందువల్ల కాస్త ఆలోచించి పనిచేయటం మంచిది."

"ఏం పని?"

"నే చెప్పినట్టు చెయ్యి. రేపటినుంచి కాలేజీలో, బయటా అతనితో ముభావంగా వుండు. సాధ్యమైనంతవరకూ తప్పించుకు తిరుగు. అతని క్రీగంట చూస్తూ, అతను నిన్ను చూడనట్లు నటించి అంటే అతను చూస్తున్నప్పుడే బాధగా భారంగా నిట్టూర్పులు విడు. నువ్వు మాట్లాడనందుకు కార ణాలు అడిగేందుకు నిన్ను కలుసుకో చూస్తాడు, కాని వంట రిగా మటుకు చిక్కకు; కాలేజీలో నే నెప్పుడూ నీ పక్కనే వుంటాను. ఇక ఇంటిదగ్గర అవకాశం యివ్వకు. వుత్తరాలు రాసినా ఎరగనట్టు వూరుకో."

"ఆపైన"

"చెప్పేది విను. తొమ్మిదో తేది శనివారం ఆ పిల్ల వస్తుందని చెప్పాడా? శుక్రవారం సాయింత్రం అతనిదగ్గిర కెళ్ళి శనివారం "టీ"కి రమ్మని పిలువు. సరిగా మూడింటికే నని పిలు. అతను కళ్ళల్లోకి దీనంగా రాను అని అనేందుకు వీల్లేకుండా చూడు. సమాధానానికి ఎదురు చూడకుండా భారంగా వచ్చేయి. అప్పుడు తెలుస్తుంది అతని సత్తువ. అతని మీద నీ హక్కు ఎంతవరకు వుందో."

"ఎట్లా?"

"ఎట్లాగేమిటి! టీకి నీతో వచ్చాడంటే, ఆ పిల్లను కలుసుకోదన్నమాట అంటే నువ్వు ఆ అమ్మాయికంటే ఎక్కువన్నమాట. యిదే పరీక్ష. ఇందులో నువ్వు నెగ్గితే, అనంతం నీవాడు. నువ్వు ఓడిపోయావో అతన్ని వదిలేయవచ్చు. అంతేగాని ఇపుడు తొందరపడకు తెలిసిందా?" అంది శకుంతల మహా యుక్తిపరురాలులా.

మాధవి తల వూపింది.

o o o o

మాధవిని కలుసుకుని ఆనాటి పరిస్థితులు విడమర్చి చెపుదామని అనంతం శాయశక్తులా ప్రయత్నించాడు. శకుంతల సలహాకు - తూచా - తప్పక పాటిస్తున్న మాధవి అనంతానికి అందలేదు. అతని ఉత్తరాలు బుట్టదాఖలాకూడా అయ్యాయి. మాధవి తనవల్ల చాలా బాధపడుతోందని గ్రహించాడు. ఆమెను వోదార్చి, లాలించాలని అనుకున్నాడు కాని...

శుక్రవారం మాధవి శకుంతలలు గేటుదగ్గిర తచ్చాడుతూ అనంతానికి కనపడ్డారు. ఇన్నాళ్లు మాధవికోసం తాను కాచుకు వుండటంగాని, మాధవి తనకోసం వుండలేదు, బహుశా తన ఉత్తరాలు పనిచేశాయేమో! ఆమె కోపం పోయిందేమో!!

మాధవి తనవైపుగావచ్చి దీనంగా ముఖంపెట్టి "రేపు

మా ఇంటికి టీకి రండి – మీతో మాట్లాడాలి" అంది నేలను చూస్తూ.

మాధవి రాజీలోకి దిగుతోందా? "ఆఁ నిరభ్యంతరంగా వస్తా" అని అతిసంతోషంతో అనబోయాడు. కాని వెంటనే షణ్ముగం జ్ఞాపకం వచ్చింది. పాపం! తనకోసం బీచి దగ్గిర కాసుకుని వుంటుంది. పోనీ ఎల్లుండి మాధవి ఇంటి కెళ్తే? రాలేనని అంటే?

మాధవి తలెత్తి అతనివంక చూసింది. నీలిమబ్బుల వంటి ఆవిడ కళ్లు తనని కట్టేశాయి. నుదుటిమీది స్వేదబిందువులు, అతని హృదయాన్ని కదిపేశాయి. పాపం! పిచ్చి మాదవి తనకోసం బాధపడ్తోంది. రానని ఎలా అనడం?

"ఊఁ" అన్నాడు.

మారుమాటాడకుండా వెళ్ళిపోయింది మాధవి.

♦ ♦ ♦

మర్నాడు టీ తాగాక "అలా తిరిగివద్దాం" అంది మాధవి అనంతం శకుంతలలతో.

అనంతానికి గడిచిన సాయంత్రం మాధవిమీదనున్న జాలి యీ సాయంత్రానికి సగం తగ్గింది. నిన్న మాధవి నిస్సహాయంగా కనబడిందిగాని యీవేళ ఏదో గర్వంగా ప్రవర్తిస్తున్నట్టనిపించింది. అతనికి చక్కగా, నేప్పుగా సింగారించుకున్న మాధవి వెనక లీలగా షణ్ముగం మాటిమాటికి

అనంతానికి జ్ఞాపకం వస్తోంది. అతని హృదయం షణ్ముగాన్ని కలుసుకోలేక పోయినందుకు కలవరపడ సాగింది.

ముగ్గురూ లేచారు. ట్రిప్లికేన్ బస్ ఆగింది. "ఎక్కదాం" అంది మాధవి. శకుంతల రెండడుగులు వేసింది. అనంతం ఎవరో ఆపినట్లు ఆగిపోయాడు. మళ్ళీ కాంటిన్‌కా? అక్కడికి కావాలని ప్రయాణం చేస్తోందా మాధవి?

నిన్నటినుంచీ కలగని అనుమానం క్షణంలో మెరిసింది. కాని వెనక్కి తగ్గడం ఇప్పుడు అనాలోచితం.

ముగ్గురూ బస్సు దిగారు. కాసేపు ఇటూ అటూ తిరిగాక, మాధవి కాంటిన్‌వైపు అడుగువేస్తూ "మీ ఇద్దరికీ నేను పార్టీ ఇస్తా" అంది వోరగా నవ్వుతూ. అనంతం అనుమానాలు దృఢమయాయి.

ముగ్గురూ మధ్య టేబుల్ దగ్గిర కూచున్నారు. మాధవి ఏవేవో లిస్టు చెబుతోంది. అనంతానికి ఏమీ అర్థం కావటం లేదు. శకుంతల దేనికోసమో వెతుకుతున్నట్టు చూస్తోంది.

ఐస్‌క్రీమ్ తింటూ ముగ్గురూ మాట్లాడుకుంటున్నారు. అనంతానికి షణ్ముగం "జిల్లునుంది" అనటం జ్ఞాపకంవచ్చింది. పాపం! అనుకున్నాడు.

మాధవి తలెత్తి "అదిగో మీ ఫ్రెండు" అంది అనంతాన్ని ఉద్దేశించి.

దూరాన షణ్ముగం ఉత్సాహంగా తనవైపు వస్తోంది. అనంతం లేవలేదు. అలా చూస్తూ కూచున్నాడు. పది అడుగులు ముందుకువచ్చి ఆగిపోయింది షణ్ముగం. ఆ ముఖంలో

నవ్వు లేదు, శూన్యంలోకి చూస్తున్నట్టు కూచున్నాడు అనంతం.

మరో నాలుగడుగులు ముందుకువచ్చి అతని వంక తేరపారచూసింది. ఆ కళ్ళలో దెబ్బతిన్న లేడి కళ్ళలోని బాధ వ్యక్తమయింది. గుండెల్లో ముల్లు గుచ్చుకుంది. అనంతం అలాగే చూస్తూ కూచున్నాడు.

షణ్ముగం గిర్రున తిరిగి నెమ్మదిగా దూరానికి వెళ్ళిపోయింది. మాధవి, శకుంతలలు షణ్ముగం వేసుకున్న పచ్చ రిబ్బను చూసి, బిగ్గరగా మరీ బిగ్గరగా నవ్వుతున్నారు. తళుకు బెళుకుల నాగరికత మానవ హృదయాన్ని చూసి, వికృతంగా నవ్వే నవ్వు అది.

ఆనాటినుంచి మాధవిమీద ఒక విధమైన అసహ్యం కలిగింది, అనంతానికి. నీలాలవంటి ఆ కళ్ళలోకి చూసినప్పుడు దెబ్బతిన్న షణ్ముగం కళ్ళు జ్ఞాపకం వచ్చేవి. మాధవిని ప్రేమిద్దామని ప్రయత్నించాడు, కాని వారిద్దరి మధ్యా షణ్ముగం భంగపాటు అడ్డమొచ్చింది.

ఆనాటినుంచీ మాధవినేకాదు, ఏ స్త్రీ కళ్ళలోకి ప్రేమతో చూడబోయినా, షణ్ముగం చూపు వెంటాడేది అనంతాన్ని. అంతే అతను ఏ స్త్రీని ప్రేమించలేకపోయాడు. ఆ సాయంత్రం తను అనాలోచితంగా జాలిపడి అలా ఎందుకు ప్రవర్తించానా—అని ఎప్పుడూ విచారిస్తూనే వుంటాడు. ఆ సాయంత్రపు దుర్బలత్వాన్ని నిందించుకోని రోజు లేదు అతని జీవితంలో.

—o—